డోన్ టౌన్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల యుద్ధానికి సిద్ధం కావాలని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధికమెజార్టీతో గెలిపించేందుకు పార్టీ శ్రేణులు అంకితభావంతో కృషి చేయాలని డోన్ నియోజకవర్గ పరిశీలకులు కోన మురళీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక సాయిశ్రీ ఫంక్షన్ హాల్‌లో శనివారం మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడితో కలిసి ఆయన కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి 15రోజులకు ఒక సారి గృహ సారథులు, కన్వీనర్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు గడప గడప కార్యక్రమంలో మన ప్రభుత్వం చేసే మంచి పనులను వివరించాలని సూచించారు. కార్యకర్తల పనితీరును బేరీజు వేసి భవిష్యత్‌లో వారికి మంచి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. 175 అసెంబ్లీ స్థానాలకు గాను 175 స్థానాలు గెలిపించాలని పార్టీ తల పెట్టిన మహా యజ్ఞంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్‌హుస్సేన్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల యుద్ధానికి సిద్ధం కండి

- వైఎస్సార్‌సీపీ పరిశీలకులు కోన మురళీధర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న కోన మురళీధర్‌రెడ్డి

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలి

బేతంచెర్ల: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాల్సిన బాధ్యత గ్రామ సచివాలయ కన్వీనర్లపైన ఉందని డోన్ నియోజకవర్గ పరిశీలకులు కోన మురళీధర్ రెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని శ్రీనగర్ కాలనీల్లోని షాదీఖానాలో వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు మూర్తుజావలీ, మండల కన్వీనర్ లక్ష్మిరెడ్డి, నాయకులు బాబుల్‌రెడ్డి, ఖాజా ఆధ్వర్యంలో గ్రామ సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ, నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాకుండా అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందనివారిని గుర్తించి న్యాయం చేయాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా అందరూ కలిసి కట్టుగా పనిచేయాలన్నారు. సంక్షేమ పాలనను చూసి ఓర్వలేక టీడీపీ అసత్య ప్రచారం చేస్తోందని, వచ్చే ఎన్నికల్లో గెలవలేమని తెలుసుకున్న టీడీపీ అధినేత చంద్రబాబు, నాయకులు... ఇదేం ఖర్మం అంటూ ఊరూరా తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర డైరక్టర్ మురళీ కృష్ణ, సింగిల్ విండో అధ్యక్షులు నారాయణ, వైస్ ఎంపీపీ రంగస్వామి, నగర పంచాయతీ వైస్ చైర్మన్లు, నాగ వెంకటేశ్వర్లు, పర్వీన్ కౌన్సిలర్లు మధు, షేక్ ముబీనా, నాగజ్యోతి, వైఎస్సార్‌సీపీ నాయకులు గూని నాగరాజు, దస్తగిరి, బీరవోలు నాగేశ్వర్ రెడ్డి, ఎద్దులన్న, వెంకటేశ్వర్లు, యకోబ్, రంగస్వామి, సలీమ్, ఖాజా హుసేన్, ఓం శివ, నాగరాజు, భరణి తదిరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

డోన్ టౌన్: సమాజ సేవలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని సీనియర్ సివిల్ జడ్జి దంగమని అన్నారు. స్వామి వివేకానంద జయంతి పక్షత్సవాల్లో భాగంగా శనివారం వినియోగదారుల రక్షణ సంఘం జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు నాగరాజు ఆధ్వర్యంలో న్యాయమూర్తి తంగమణిని ఆమె ఛాంబర్‌లో కలిసి స్వామి వివేకానంద చిత్ర పటాన్ని బహూకరించి సత్కరించారు.

నేడు చల్లా విగ్రహావిష్కరణ

అవుకు: మండలకేంద్రం అవుకు సమీపంలోని చల్లా ఫామ్ హౌస్‌లో ఆదివారం దివంగత నేత చల్లా రామకృష్ణా రెడ్డి విగ్రహావిష్కరణ చేస్తున్నట్లు ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి తెలిపారు. చల్లా రెండవ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని దివంగత ఎమ్మెల్సీ చల్లా భగీరథ్ రెడ్డి భావించారని, దురదృష్టవశాత్తు ఆయన అకాల మరణం బాధాకరమన్నారు.ఈనేపథ్యంలో చల్లా రామకృష్ణారెడ్డి భార్య శ్రీదేవి, పెద్ద కుమారుడు విఘ్నేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో చల్లా విగ్రహావిష్కరణ జరుగుతుందని చెప్పారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత


నగదు అందజేస్తున్న ఎంపీడీఓ సుబ్బరాజు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని చింతలాయిపల్లెలో షేక్ మాబుషా కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సాయం రూ.10 వేలను మృతుడి భార్య షేక్ ఆజారకు శనివారం ఎంపీడీఓ సుబ్బరాజు, వైఎస్సార్‌సీపీ నేత అంబటి చంద్రమోహన్‌రెడ్డి అందజేశారు. మాబుషా రెండు రోజుల క్రితం గుండె పోటుతో మృతి చెందాడు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి వెంకటసుబ్బయ్య, వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటేష్, డిజిటల్ అసిస్టెంట్ నాగార్జున, వలంటీర్ రమ్యదీప్తి పాల్గొన్నారు.

యాగంటి క్షేత్రాన్ని దర్శించుకున్న తెలంగాణ అడిషనల్ డీజీ

బనగానపల్లెరూరల్: యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయాన్ని తెలంగాణ రాష్ట్రం అడిషనల్ డీజీ కొత్తకోట శ్రీనివాసరెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు.అనంతరం ఏకశిలా రూపంలో కొలువైన శివపార్వతులకు ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మద్దిలేటయ్య ను దర్శించుకున్న అడిషనల్ డీజీ

బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహా స్వామి ఆలయాన్ని తెలంగాణా అడిషనల్ డీజీ కే శ్రీనివాసులు రెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఆయన కు ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ సీతారామ చంద్రుడు, వేదపండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, స్వామి, అమ్మ వార్ల ప్రత్యేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేసి సత్కరించారు.

కొత్తగా 462 పింఛన్ల మంజూరు

బనగానపల్లె: మండలంలో 12,114 పాతపింఛన్లు ఉండగా కొత్తగా మరో 462 మందికి మంజూరు అయ్యా యని ఎంపీడీఓ శివరామయ్య తెలిపారు. జనవరి 1వ తేదీన పెంచిన మొత్తంతో కలిపి రూ.2750 చొప్పున లబ్ధిదారులకు వలంటీర్లు అందజేస్తారని, మొత్తం రూ.3.43 కోట్లు పంపిణీ చేయనున్నామన్నారు.

203 కొత్త పింఛన్‌లు మంజూరు

కొలిమిగుండ్ల: మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో కొత్తగా 203 పింఛన్‌లు మంజూరైనట్లు ఎంపీడీఓ సుబ్బరాజు తెలిపారు. కొత్తగా మంజూరైన పింఛన్ లబ్ధిదారులకు జనవరి 4వ తేదీన కొలిమిగుండ్లలోని షిర్డీసాయి ఫంక్షన్ హాల్‌లో ఎమెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి చేతుల మీదుగా వైఎస్సార్ పింఛన్ కానుక అందజేస్తామన్నారు.

ట్యాబ్‌ల పంపిణీ


ట్యాబ్‌లు అందజేస్తున్న నాయకులు

బనగానపల్లె: మండలంలోని పలుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు శనివారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండంశేషిరెడ్డి, మండల కన్వీనర్ గుండంనాగేశ్వరరెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మల్లికార్జుననాయక్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. మండల కన్వీనర్ గుండంనాగేశ్వరరెడ్డి పంపిణీ చేశారు.

ప్రధానోపాధ్యాయుడి మృతి

కోవెలకుంట్ల: సంజామల మండలం ఆకుమల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వర్తిస్తున్న సుబ్బరాయుడు(57) శుక్రవారం రాత్రి మృతి చెందాడు. గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ కోలుకోలేక మృత్యువాత పడ్డారు. హెచ్‌ఎం మృతి పట్ల ఎంపీటీసీ గౌరుగారి కిరణ్ కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

గ్రామాల అభివృద్ధికి కృషి


సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ

బేతంచెర్ల: మండలంలోని ఆయా గ్రామాలను ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో దశల వారీగా అభివృద్ధి చేస్తున్నామని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. శనివారం ముద్దవరం గ్రామంలో జరుగుతున్న సీసీ రోడ్లు, ఓవర్ హెడ్ ట్యాంక్, డబుల్ రహదారి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అలాగే గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల విన్నపం మేరకు సీసీ రోడ్లు ఏర్పాటు చేసినట్లు ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ నాయకులు బుగ్గన కుమార్‌రెడ్డి, బండికాటి వెంకటేశ్వర్‌రెడ్డి, ఎద్దులన్న, గోరుమానుకొండ సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కలియుగ దానకర్ణుడు.. బుడ్డా వెంగళరెడ్డి

కోవెలకుంట్ల: కనీవిని ఎరుగని డొక్కల కరువు సమయంలో ప్రజల ఆకలి తీర్చిన ఉయ్యాలవాడకు చెందిన బుడ్డా వెంగళరెడ్డి దానకర్ణుడిగా కీర్తింపబడుతున్నారని వక్తలు కొనియాడారు. శనివారం పట్టణంలో ప్రకృతి పీఠం ఆధ్వర్యంలో వెంగళరెడ్డి 122 వర్ధంతిని నిర్వహించారు. ముందుగా బుడ్డా వెంగళరెడ్డి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి, రిటైర్డ్ హెచ్‌ఎం నారాయణస్వామి మాట్లాడుతూ 1860 సంవత్సరంలో రాయలసీమలో సంభవించిన డొక్కల కరువు బీభత్సాన్ని గమనించిన బుడ్డావెంగళరెడ్డి గంజి కేంద్రాలను ప్రారంభించి తన వద్ద ఉన్న ధాన్యంతో మూడు సంవత్సరాలపాటు అన్నదానం చేశారన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని ఏడుకొప్పెర్లబావి సమీపంలో పేకాటాడుతున్న ఎనిమిది మందిని శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టణంతోపాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వ్యక్తులు పేకాట ఆడుతుండగా అందిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. వారి వద్ద నుంచి రూ. 37వేల నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మౌలానీ తెలిపారు.











అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి
- బుగ్గనకు హారతులుపట్టి స్వాగతం పలికిన మహిళలు


లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్ : అర్హతే ప్రామాణికంగా కులమతాలు, పార్టీలు, వర్గాలు, ప్రాంతాలకు అతీతంగా పేదలందరికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేస్తుందని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. పట్టణ పరిధిలోని 18వ వార్డులో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కౌన్సిలర్ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంత్రి నిర్వహించారు. ఆయా కాలనీలో పర్యటించిన మంత్రికి మహిళలు హారతులుపట్ట స్వాగతం పలికారు. అధికారులు, నాయకులతో కలిసి వార్డులో విస్తృతంగా పర్యటించిన మంత్రి గడప గడపకు వెళ్లి ప్రతిఒక్కరినీ పలుకరిస్తూ ముందుకు సాగారు. మూడున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరిండంతోపాటు స్థానికులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంభనకు వైఎస్‌ఆర్ చేయూత, అమ్మ ఒడి, ఈబీసీ నేస్తం, కాపు నేస్తం లాంటి అనేక పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కులం, మతం, వర్గం, ప్రాంతం రాజకీయ వివక్షతకు తావులేకుండా ప్రతిఒక్క అర్హునికీ ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు అందించాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఆరోగ్యశ్రీని ప్రవేశపెట్టిన ఘనత దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డికే దక్కిందని, ఆ పథకాన్ని మరింత విస్తరించి తండ్రికితగ్గ తనయుడని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరూపించుకున్నారన్నారు. సామాజిక న్యాయం దిశగా బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్లు కల్పించిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు.

తాగునీటి సౌకర్యానికి పెద్దపీట

తాగునీటి సౌకర్యానికి ప్రభుత్వం పెద్దపట వేసిందని, వచ్చే వేసవి నాటికి నియోజకవర్గంలో డోన్, పత్తికొండ ప్రాంతాలకు మంచినీటిని అందించేందుకు గోరుకల్లు రిజర్వాయర్ నుండి పైపులైన్ల ద్వారా మంచినీరు అందించేందుకు కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తోందని మంత్రి బుగ్గన వివరించారు. అన్ని గ్రామాల్లో ఇంటింటికి మంచినీటి కుళాయి కనెక్షన్ ఇప్పించడం ద్వారా నీటి ఎద్దడి లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎలాంటి సాగునీటి అవకాశం లేని డోన్ నియోజకవర్గంలో 10వేల ఎకరాలకు వచ్చే జూన్ మాసం నాటికి చెరువులను హంద్రీనీవా నీటితోనింపి సాగునీటిని అందిస్తామన్నారు. మంత్రి వెంట రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, కమిషనర్ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ జాకీర్ హుసేన్, కౌన్సిలర్లు దినేష్‌గౌడ్, నాగేంద్ర, వెంకట్రాముడు, సుంకన్న, మేకల విమల, బుర్రు రమాదేవి, వెంకటేశ్వరమ్మ, సుమలత సురేష్, మౌళాభీ, కాశింబి, మిట్టా ఉమామహేశ్వరి, కాలేషా, కళావతి, శశికళ, బద్దల సుబ్బలక్ష్మి, ధారా హరినాథ్‌రెడ్డి, ఆర్ట్ రమణ, కటిక వేణు, వైఎస్సార్‌సీపీ నాయకులు పోస్టుప్రసాద్, ఆర్‌ఈ రాజవర్ధన్, మల్యాల శ్రీనివాసరెడ్డి, మహేంద్ర, మల్లికార్జున, భాస్కర్, రంగస్వామి, మేకల రాజు, పెద్దయ్య, కోఆప్షన్ సభ్యులు కుమ్మరి రాజు, పాతపేట రఫీలు పాల్గొన్నారు.

క్రీడారంగానికి ప్రాధాన్యం

- మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తాం
- మంత్రి బుగ్గన


జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో కలిసి ఇండోర్ స్టేడియాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన

డోన్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం క్రీడారంగానికి ప్రాధాన్యతనిస్తుందని, ఇంతవరకు సరైన ప్రోత్సాహంలేక మరుగునపడిన మట్టిలో మాణిక్యాల ప్రతిభలను వెలికితీస్తామని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో మున్సిపల్ ఆధ్వర్యంలో రూ.2కోట్లతో ఆర్‌అండ్‌బీ శాఖ నిర్మించిన బుగ్గన శేషారెడ్డి మెమోరియల్ ఇండోర్ స్టేడియాన్ని శనివారం జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డోన్ నియోజకవర్గంలో షటిల్, బ్యాడ్మింటన్, టెన్నిస్ క్రీడా మైదానాలను ఏర్పాటుచేయడంతో పాటు స్విమ్మింగ్ పూల్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు. అత్యంత ఆధునిక వసతులతో రాయలసీమ జిల్లాలో ఎక్కడాలేని విధంగా స్టేడియం నిర్మించడం గర్వంగా ఉందన్నారు.

క్రీడాకారుల అపూర్వ స్వాగతం

ఇండోర్ స్టేడియాన్ని ప్రారంభించేందుకు విచ్చేసిన మంత్రి బుగ్గనకు స్థానిక క్రీడాకారులు ఘనంగా స్వాగతం పలికారు. శాలువాలు కప్పి గజమాలలతో సత్కరించారు. అనంతరం జ్ఞాపికను అందజేశారు. మంత్రి బుగ్గన క్రీడాకారులను పరిచయం చేసుకున్న తర్వాత షటిల్ టోర్నమెంట్‌ను సర్వీస్ చేసి ప్రారంభించారు.

మంత్రి బుగ్గన పాదయాత్ర

అంతకుముందు ఉదయం 9 గంటలకు నెహ్రూ నగర్‌లోని తన స్వగృహం నుంచి ప్రధాన రహదారిపై మంత్రి పాదయాత్ర నిర్వహించారు. కోర్టు, తహసీల్దార్ కార్యాలయం, పోలీసుస్టేషన్, పాతబస్టాండ్‌ల మీదుగా రైల్వేస్టేషన్ వద్దగల ఇండోర్ స్టేడియం వరకు ఈ పాదయాత్ర సాగింది. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ శ్రీధర్‌రెడ్డి, ఈఈ సురేష్‌బాబు, డీఈ ప్రసాద్‌రెడ్డి, ఏఈ శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడులు పాల్గొన్నారు.

రహదారి సౌకర్యం కల్పించండి

పత్తికొండ నియోజకవర్గంలోని హోసూరు నుండి ఆలూరు నియోజకవర్గంలోని మొలగవెల్లి గ్రామం వరకు రహదారి నిర్మాణానికి రూ.7కోట్లను మంజూరు చేయాలని కోరుతూ పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రిని కలిసి ఆమె పత్తికొండ నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి తగిన నిధులు మంజూరు చేయాలని కోరారు.

దంపతులకు గాయాలు

కోవెలకుంట్ల: స్థానిక జమ్మలమడుగు ఆర్‌అండ్‌బీ రహదారిలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. ఉయ్యాలవాడ మండలం ఆర్. జంబులదిన్నెకు చెందిన సురేంద్ర, పుష్పవతి బైక్‌పై కోవెలకుంట్లకు వస్తుండగా గుళ్లదూర్తి సమీపంలో ప్రమాదం చోటు చేసుకుంది. అటుగా వెళ్తున్న ప్రయాణికులు 108లో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సుఖసంతోషాలతో మెలగాలి


జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: నూతన సంవత్సరంలో అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో మెలగాలని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పాడిపంటలతో రైతుల ఇళ్లు కళ కళలాడాలని, ప్రతి కుటుంబం సంతోషంగా గడపాలని కోరారు.

మెట్టుపల్లెలో ఘర్షణ

అవుకు: మండల పరిధిలోని మెట్టుపల్లెలో ఇద్దరు వ్యక్తుల మధ్య శనివారం ఘర్షణ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన జగన్‌మోహన్ రెడ్డి, మద్దయ్యల పొలం వద్ద నీటి పారుదల విషయంలో గొడవపడ్డారు. మద్దయ్యకు గాయాలు కావడంతో బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

మత్తుకు దూరంగా ఉండాలి

డోన్ రూరల్ : విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సెబ్ ఇన్‌స్పెక్టర్ భీమలింగ సూచించారు. డ్రగ్స్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం అవుతాయనే విషయాన్ని తెలుసుకుని మసలుకోవాలని సూచించారు. ఎక్కడైనా మత్తు పదార్థాలు అమ్ముతున్నా, తయారు చేస్తున్నా సెబ్ టోల్‌ఫ్రీ నంబర్ 14500కు బాధ్యతగా సమాచారం ఇవ్వాలని తెలిపారు.

ఇంటర్వ్యూలు

బేతంచెర్ల: స్థానిక శేషారెడ్డి ఉన్నత పాఠశాల్లో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రెండు బ్యాచ్‌లకు 45 రోజుల పాటు డ్రోన్ ఇనిస్ట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కంపెనీ ద్వారా డ్రోన్ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఉద్యోగ నియామకానికి శనివారం ప్రత్యేక ఇంటర్వ్యూలు నిర్వహించారు. సెంచూరియన్ యూనివర్సిటీ వారి గ్రామ్ తరంగ్ డెవలప్‌మెంట్ కంపెనీలో ఉద్యోగ అవకాశం కొరకు అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు.







